క్లుప్తంగా

కళ్లకలకపై ఆందోళన వద్దు

నాగర్‌కర్నూల్ క్రైం: కళ్ల కలకపై ప్రజలు ఆందోళన పడాల్సిన అవసరంలేదని డీఎంహెచ్‌ఓ డా.సుధాకర్‌లాల్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో విద్యార్థినులకు కళ్లకలకపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడారు. వాతావరణంలో మార్పులతో కళ్లకలక వస్తుందని, వారం రోజుల్లోనే నయమవుతుందని అన్నారు.

నర్సరీల పరిశీలన

తాడూరు: యాదిరెడ్డిపల్లి, ఇంద్రకల్, లచ్చిరాం తండాల్లోని నర్సరీలను ఎంపీడీఓ గంగమోహన్ బుధవారం ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి సునితతో పాటు, ఉపాధిహామీ సిబ్బందికి మొక్కల నిర్వహణపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయా పంచాయతీలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు.

ఎంపీడీఓ సమీక్ష

చారకొండ: మండల కేంద్రంలో ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఎంపీడీఓ జయసుధ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడారు. పంచాయతీలో వేయి మొక్కలు నాటేలా ప్రణాళిక సిద్ధం చేయాలని అన్నారు. క్రీడా ప్రాంగణాల్లో సంబంధిత వాటి ఏర్పాటు చేయాలన్నారు. సమావేశానికి అంబుడ్స్ పర్సన్ జంగయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మార్గదర్శకాలు, ఫిర్యాదులు, పరిష్కారాలు, సామాజిక తనిఖీ వంటి అంశాలు, ఉపాధిహామీపై పూర్తి అవగాహన ఉండాలని సూచించారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

ఉప్పునుంతల: రేషన్‌డీలర్ల సంఘం ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలో సీఎం కేసీఆర్, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ప్రభుత్వం క్వింటాలుకు రూ.70 నుంచి రూ.140 పెంచడంతో పదమూడు రకాల డిమాండ్లను పరిష్కరించిందని సంతోషం వ్యక్తం చేశారు. కుమారస్వామి, శంకర్‌నాయక్, అబుబాకర్, తిరుపతయ్య ఉన్నారు.

సుంకిరెడ్డితో సమావేశం

కల్వకుర్తి రూరల్: బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భారత రాష్ట్ర సమితి యువ నాయకుడు శివప్రసాద్ బుధవారం కల్వకుర్తిలోని ఐక్యతా కార్యాలయంలో సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డితో సమావేశం అయ్యారు. కొద్ది రోజుల కిందట బీఆర్‌ఎస్‌లో చేరిన శివప్రసాద్ తన మనస్సు మార్చుకుని తిరిగి కాంగ్రెస్‌లో చేరేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. తుర్కలపల్లిలో సమావేశం ఏర్పాటు చేసి కాంగ్రెస్ పార్టీలో చేరుతానని శివప్రసాద్ విలేకరులకు తెలియజేశారు.

స్థల పరిశీలన

మన్ననూర్: అమ్రాబాద్ మండలం తుర్కపల్లిలో క్రీడా ప్రాంగణం ఏర్పాటు కోసం స్థల పరిశీలన చేస్తామని ఎంపీడీఓ రామ్మోహన్ తెలిపారు. బుధవారం గ్రామంలో పర్యటించి వాటర్ ట్యాంకు సమీపంలోని ప్రభుత్వ స్థలాన్ని ఎంపిక చేశారు. ఎంపీఓ వెంకటయ్య, రఘు, గ్రామపంచాయతీ, ఉపాధిహామీ పథం సిబ్బంది పాల్గొన్నారు.

కల్వకుర్తి తహసీల్దార్‌గా రాజేందర్‌రెడ్డి

కల్వకుర్తి: కల్వకుర్తి తహసీల్దార్‌గా రాజేందర్‌రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కలెక్టర్ కార్యాలయం నుంచి రాజేందర్‌రెడ్డి కల్వకుర్తి తహసీల్దార్‌గా బదిలీ అయ్యారు. బుధవారం రాజేందర్‌రెడ్డి ఎమ్మెల్యే జైపాల్ యాదవ్‌ను కలిశారు. బాధ్యతలు తీసుకున్న తహసీల్దార్‌ను కార్యాలయ సిబ్బంది సత్కరించారు.

శివశ్రీనివాస్ బదిలీ

కొల్లాపూర్: స్థానిక తహసీల్దార్ శివశ్రీనివాస్ అమ్రాబాద్ మండలానికి బదిలీ అయ్యారు. ఈ మేరకు కలెక్టర్ నుంచి ఉత్తర్వులు వెలువడటంతో ఆయన బుధవారం రిలీవ్ అయ్యారు. ఆయన స్థానంలో డిప్యూటీ తహసీల్దార్ విష్ణువర్ధన్‌రావుకు అదనపు బాధ్యతలు అప్పగించారు.

ఉద్యోగులపై దాడులు చేస్తే శిక్షార్హులు

కొల్లాపూర్ రూరల్: పోలీసులు, మరియు ఇతర ప్రభుత్వ ఉద్యోగులపై ప్రజలు దాడులు చేస్తే శిక్షార్హులవుతారని కొల్లాపూర్ జూనియర్ సివిల్ జడ్జి ఆర్‌వీవీఎస్‌ఎస్ మిధున్ తేజ అన్నారు. బుధవారం మండల పరిధిలోని సోమశిలలో తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు మండల న్యాయ సేవా అధికార సంఘం ఆధ్వర్యంలో ప్రతి గ్రామంలో న్యాయ సాయం అందించే కార్యక్రమంలో భాగంగా సోమశిలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మోటార్ వాహనాల చట్టం, లోక్‌అదాలత్, ఉచిత న్యాయ సాయంపై ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఒకటో అదనపు న్యాయమూర్తి జ్యోత్స్న, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వసంతరెడ్డి, న్యాయవాదులు నిరంజన్ రామలక్ష్మమ్మ, గోవిందు, కుర్మయ్య తదితరులు పాల్గొన్నారు.



‘గృహలక్ష్మి’కి గడువు పెంచాలని నిరసన

తాడూరు: ప్రభుత్వం అమలు చేస్తున్న గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకునే గడువును పెంచాలని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ మహ్మద్ అలీకి వినతి అందజేశారు. కార్మిక సంఘం జిల్లా నాయకులు కాశన్న మాట్లాడారు. గృహలక్ష్మి పథకానికి మూడు రోజుల గడువు ఇవ్వడంతో నిజమైన లబ్ధిదారులు నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. దరఖాస్తు చేసుకోవడానికి ఓటరు ఐడీ, ఇంటి పన్ను, కరెంటు బిల్లు, ప్లాట్ రిజిస్ట్రేషన్ పత్రాలు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు తీయడానికే దాదాపు 20 రోజుల సమయం పడుతుందని, మూడు రోజుల గడువు ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. బీసీ పొలిటికల్ జేఏసీ జిల్లా అధ్యక్షుడు అరవిందాచారి, కాశన్న, మల్లయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్ నిరసన

కల్వకుర్తి టౌన్: గృహలక్ష్మి పథకానికి గడువు పెంచాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేశారు. విజయ్‌కుమార్ రెడ్డి, ఆంజనేయులు, శ్రీనివాస్ రెడ్డి, గోపాల్ పాల్గొన్నారు.

చారకొండ: ప్రభుత్వం నిరుపేదల ఇంటి నిర్మాణానికి గృహలక్ష్మి పథకంలో దరఖాస్తుల గడువును ఈ నెల చివరివరకు పెంచాలని సీపీఎం మండల కార్యదర్శి బి.బాలస్వామి కోరారు. మండల కేంద్రంలో బుధవారం విలేకరుతో మాట్లాడారు. దరఖాస్తుదారులకు కావాల్సిన కులం, ఆదాయం, ఇతర ధ్రువీకరణ పత్రాలు రావడం ఆలస్యం అవుతుందన్నారు.

లింగాల: ప్రభుత్వం ఇళ్ల నిర్మాణం కోసం అమలు చేయనున్న గృహలక్ష్మి పథకం కోసం దరఖాస్తు చేసుకునే గడువును ఈ నెల 31 వరకు పెంచాలని బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు సత్యేశ్వరం కోరారు.

నాగర్‌కర్నూల్‌రూరల్: గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకునే తుదిగడువును ఈ నెల 31వరకు పొడిగించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రసిడెంట్ కుంభం మల్లేష్‌గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం 3 రోజులు గడువును విధించడంతో పేదలు ఈ అవకాశాన్ని కోల్పోతారన్నారు. కాళ్ల నిరంజన్, రవీందర్‌గౌడ్, లక్ష్మయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



పెద్దకొత్తపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద దరఖాస్తు చేసుకుంటున్న ప్రజలు

1224 దరఖాస్తులు

వెల్దండ: మండల పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన లబ్ధిదారులు గృహలక్ష్మి పథకానికి 1224 దరఖాస్తులు చేసుకున్నారు. బుధవారం వెల్దండ తహసీల్దార్ కార్యాలయంలో, ఎంపీడీఓ కార్యాలయంలో రెండు ప్రత్యేక కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు.

దరఖాస్తులకు పాట్లు

కొల్లాపూర్: గృహలక్ష్మి పథకానికి దరఖాస్తులు చేసుకునేందుకు ప్రజలు అగచాట్లు పడుతున్నారు. దరఖాస్తులు చేసుకునేందుకు గడువు తక్కువగా ఉండటంతో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం ప్రజలు తహసీల్దార్ కార్యాలయం, మీసేవా కేంద్రాలు, జిరాక్స్ సెంటర్ల చుట్టూ తిరుగుతున్నారు. బుధవారం కొల్లాపూర్‌లో పెద్దసంఖ్యలో ప్రజలు ధ్రువీకరణ పత్రాల కోసం క్యూలు కట్టారు. మున్సిపల్ కార్యాలయంలో పెద్దసంఖ్యలో ప్రజలు గృహలక్ష్మికి దరఖాస్తులు ఇచ్చారు.

కిక్కిరిసిన తహసీల్దార్ కార్యాలయం

పెద్దకొత్తపల్లి: గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు తహసీల్దార్ కార్యాలయం బుధవారం కిటకిటలాడింది. దరఖాస్తు చేసుకునేందుకు మూడు రోజుల గడువు ఇవ్వడంతో ప్రజలంతా పెద్దఎత్తున తరలివచ్చి దరఖాస్తులు అందజేశారు. గడువు పెంచాలని దరఖాస్తుదారులు రాజు, స్వామి, రాములు కోరారు.

భారీగా దరఖాస్తులు

పెంట్లవెల్లి: మండలంలోని పలు గ్రామాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున గృహలక్ష్మి పథకానికి దరఖాస్తులు చేసుకున్నారు. బుధవారం మండలంలోని పలు మీసేవా కేంద్రాల వద్ద ప్రజలు పెద్ద ఎత్తున బారులు తీరి దరఖాస్తులు చేసుకునేందుకు వేచి ఉన్నారు.

గడువు పెంచాలి

గృహలక్ష్మి పథకం కోసం పేదలు దరఖాస్తు చేసుకునే సమయం మూడు రోజులే ఉండటంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దరఖాస్తు చేసుకునేందుకు గడువు పెంచాలని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు భరత్‌చంద్ర ఆధ్వర్యంలో తహసీల్దార్ ఇక్బాల్‌కు బుధవారం వినతి అందజేశారు.

నాగిళ్లకు నీరివ్వాలి

కల్వకుర్తి: కల్వకుర్తి ఎత్తిపోతల పథకం పనులు సెప్టెంబర్ నాటికి పూర్తికావాలని, హరికథలు చెబితే వినే ప్రసక్తే లేదని కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ఇరిగేషన్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ప్యాకేజ్ నంబర్ 29డి 82 పనులపై సమీక్ష నిర్వహించారు. గత సమీక్షలో చెప్పిన విధంగా పనుల పురోగతిపై ఆరా తీశారు. ప్రభుత్వం 4.60లక్షల ఎకరాలకు సాగు నీరు అందించేందుకు 25 టీఎంసీల నీటిని కేటాయించగా.. సీఎం కేసీఆర్ మరో 20 టీఎంసీల నీటిని కేటాయించి 45 టీఎంసీలకు పెంచారన్నారు. జిల్లాలోని కొల్లాపూర్, నాగర్‌కర్నూల్, కల్వకుర్తి, అచ్చంపేట, నియోజకవర్గాల పరిధిలో సాగునీరు అందించేందుకు నిధులు మంజూరు చేశారన్నారు. డి82 కాల్వ 90 శాతం పూర్తయిందని, సెప్టెంబర్ చివరి నాటిని మిగతా పనులు పూర్తి చేసి నాగిళ్లలోని ఊర చెరువు నింపాలన్నారు. ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీకాంత్, డీఈ దేవన్న, నరేందర్, ప్రాజెక్ట్ కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

కోర్టు భవనం పరిశీలన

కల్వకుర్తి టౌన్: పట్టణంలోని సీనియర్ సివిల్ కోర్టు భవన ప్రాంగణాన్ని కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పరిశీలించారు. బుధవారం కోర్టులోని లాయర్ల కార్యాలయం, రికార్డుల రూంలను పరిశీలించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జైపాల్ యాదవ్

వెల్దండ: మండల పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ బుధవారం కల్వకుర్తి క్యాప్ కార్యాలయంలో 11 మంది లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు.

ఆర్యవైశ్యులకు అండగా నిలుస్తా

కల్వకుర్తి రూరల్: ఆర్యవైశ్యులకు అండగా నిలుస్తానని ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ హామీ ఇచ్చారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ సాధనలో భాగంగా జిల్లాలోని ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు అందించాలని జిల్లా ఆర్యవైశ్య మహాసభ తీర్మానం చేసింది. అందులో భాగంగా బుధవారం కల్వకుర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కల్వకుర్తి డివిజన్ ఆర్యవైశ్యుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమంలో విద్యా కమిటీ రాష్ట్ర చైర్మన్ శ్యాంసుందర్, రామకృష్ణ, గోవర్ధన్, రమేశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

నల్లమల యువకుడికి గోల్డ్‌మెడల్

మన్ననూర్: సిద్దిపేటలో నిర్వహించిన మ్యారథాన్ రన్‌లో నల్లమల గిరిజన యువకుడు రమేష్ చంద్ర గోల్డ్ మెడల్ సాధించాడు. ఈ సందర్భంగా బుధవారం అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాల్‌రాజ్, ఈ ప్రాంత ప్రజలు రమేష్‌చంద్రను ప్రశంసించారు. అమ్రాబాద్ మండలం మన్ననూర్‌లోని ఉమామహేశ్వర కాలనీకి చెందిన రమేష్ చంద్ర అంకితభావంతో కృషి చేసి గోల్డ్‌మెడల్ సాధించడం గర్వంగా ఉందన్నారు. అచ్చంపేట నియోజకవర్గంలోని తల్లిదండ్రులు తమ పిల్లలను చదువుతో పాటూ క్రీడల్లో రాణించే విధంగా తర్ఫీదు ఇప్పించాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు.



రమేష్ చంద్ర

11న జిల్లాస్థాయి నాయకుల సమావేశం

కందనూలు: సార్వత్రిక ఎన్నికల్లో అనుసరించాల్సిన విధానాలపై ఈ నెల 11న పార్లమెంట్ ఇన్‌చార్జ్ మోహన్ ఆధ్వర్యంలో పార్లమెంట్ పరిధిలోని జిల్లాల అధ్యక్షులు, పీసీసీ వైస్ ప్రసిడెంట్లు, జిల్లా స్థాయి నాయకులతో సమావేశం నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు వంశీకృష్ణ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఏఐసీసీ, పీసీసీ పిలుపు మేరకు బుధవారం జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ శ్రేణులు చెంచుల గూడెంలు, గిరిజన తండాల్లో నిద్ర చేయాలని, కార్యక్రమంలో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడు చేసిన అభివృద్ధిని, సంక్షేమ పథకాలను వారికి వివరించాలని సూచించారు.

యూత్ కాంగ్రెస్ జెండా ఆవిష్కరణ

యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో యూత్ కాంగ్రెస్ జెండాను వంశీకృష్ణ ఆవిష్కరించారు. కూచుకుళ్ల రాజేష్ రెడ్డి, నాగం శశీధర్ రెడ్డి, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కోడిదల రాము, హరీశ్ గౌడ్, హబీబ్, అర్థం రవి తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతులపై రైతులకు అవగాహన



చిన్నముద్దునూరులో రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ కళాశాల విద్యార్థులు

తెలకపల్లి: మండల పరిధిలోని చిన్నముద్దునూరు, రాంరెడ్డిపల్లి గ్రామాల్లో బుధవారం రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల విద్యార్థులు రైతులకు అవగాహన కల్పించారు. ఆధునిక పద్ధతులను ఉపయోగించి పంటలు పండించాలని సూచించారు. వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఆధునిక పద్ధతులు ఉపయోగించి పంటలు పండించాలని విద్యార్థులతో పాటు పాలెం కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ శైలజ అన్నారు. విశ్వవిద్యాలయం క్షేత్ర పర్యటనలో భాగంగా రాంరెడ్డిపల్లిలో పంటల మార్పిడి ఆవశ్యకత నీటి పారుదల, వనరులు, చెరువులు కుంటలు, కాల్వలు తదితర వాటిపైన గ్రామంలో నమూనా పటాల ద్వార అవగాహన కల్పించారు. కేవీకే శాస్త్రవేత్త లావణ్య, రావేఫ్ విద్యార్థులు పూజిత, వాణి, నిఖిత, అశ్రిత, ప్రీతి, రైతులు లక్ష్మయ్య, బొందయ్య, ధనుంజయ్, చిన్న ముద్దునూరు దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు.

కులమతాలకు అతీతంగా ప్రార్థనలు



పెంట్లవెల్లి: మండల పరిధిలోని జటప్రోలులో బుధవారం నుంచి మాసూం బాబ దర్గా ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. మూడు రోజుల ఉత్సవాలు కొనసాగుతాయి. సయ్యద్ వలీయోద్దీన్ షా చేతుల మీదుగా ఛాదర్ సమర్పించి కవ్వాలి చేస్తారు. ఇతర ప్రాంతాల నుంచి ఉత్సవాలకు గంధాన్ని అలంకరించుకుని ప్రార్థనలు చేసి ఫతేహాలు సమర్పించుకున్నారు.

గ్రామాల్లో కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం

మన్ననూర్: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జెడ్పీటీసీ డాక్టర్ అనురాధ హాత్‌సే హాత్ జోడో కార్యక్రమంలో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బుధవారం మన్ననూర్, వెంకటేశ్వర్లబావి గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి పర్యటించారు.

రాజకీయాల్లో యువతనే కీలకం

కల్వకుర్తి టౌన్: ప్రస్తుత రాజకీయాల్లో యువతనే ప్రధాన భూమిక పోషిస్తుందని కాంగ్రెస్ నాయకులు అన్నారు. బుధవారం యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఇందిరాగాంధీ విగ్రహం వద్ద వేడుకలు నిర్వహించారు.

కొల్లాపూర్: యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో యూత్ కాంగ్రెస్ జెండాను కాంగ్రెస్ సీనియర్ నాయకులు రంగినేని జగదీశ్వరుడు ఎగురవేశారు.

ప్రతి గడపకు బీజేపీ

బిజినేపల్లి: మండలంలోని గుడ్లనర్వలో మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా గడప గడపకు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొండా మణెమ్మ ఆధ్వర్యంలో బీజేపీ పథకాల గురించి వివరించారు. గృహలక్ష్మి గడువు నిరంతర ప్రక్రియగా ఉంచాలని డిమాండ్ చేశారు. మల్లికాడి లక్ష్మణ్, కొండా నాగేష్, వెంకటయ్య, వెంకట్‌రెడ్డి, రాజు పాల్గొన్నారు.

మెరుగైన విద్యనందించాలి

తాడూరు: మండల కేంద్రంతో పాటు ఆయా ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు తరగతిగదిలో మెరుగైన విద్యను బోధించేందుకు ఉపాధ్యాయులకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎంఈఓ భాస్కర్ రెడ్డి తెలిపారు. ఎఫ్‌ఎల్‌ఎస్ శిక్షణ కార్యక్రమంలో భాగంగా వారం రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణలో పాల్గొన్న ఉపాధ్యాయులకు ఎంఈఓ సూచనలు, సలహాలు ఇచ్చారు. రోజు రోజుకు విద్యాపరంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా తరగతిగదిలో విద్యార్థులకు బోధన చేయాల్సి ఉంటుందన్నారు. సీ, డీ గ్రేడ్‌లోని విద్యార్థులను ఏ, బీ గ్రేడ్‌లోకి తెచ్చేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలన్నారు.

ఫొటోగ్రాఫర్ మృతికి సంతాపం

కొల్లాపూర్: అనారోగ్యంతో మృతిచెందిన బిజినేపల్లి మండల ఫొటోగ్రాఫర్ శివకు కొల్లాపూర్‌లో ఫొటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ నాయకులు నివాళి అర్పించారు. కట్టా శ్రీనివాసులు, షబ్బీర్, హసన్ పీర్, సైదులు తదితరులున్నారు.

పర్యావరణ సమతుల్యతను కాపాడండి

బల్మూర్: ప్రతిఒక్కరూ మొక్కలు నాటడం తమ జీవన విధానంలో ఒక భాగంగా అలవర్చుకోని పర్యావరణ సమతుల్యతను కాపాడాలని మండలంలోని కొండనాగుల ఉమామహేశ్వరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ రవిపరంగి కోరారు. మండలంలోని కొండనాగులలో బుధవారం ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ వెంకటయ్య ఆధ్వర్యంలో నాదేశం–నాభూమి కార్యక్రమంలో భాగంగా కళాశాల మైదానంలో మొక్కలు నాటారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి

కందనూలు: ప్రతిఒక్కరూ ఒక మొక్క నాటి పర్యావరణాన్ని సంరక్షించాలని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అనసూయ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో భారత ప్రభుత్వం అమలు చేస్తున్న మేరీ మట్టి, మేరా దేశ్ కార్యక్రమం ప్రచారంలో భాగంగా ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ 1 ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కే.వెంకటేశ్వరరావు, లెక్చరర్లు లక్ష్మి, షహజాది బేగం పాల్గొన్నారు.

మొక్కల పెంపకంపై నిర్లక్ష్యం తగదు

బిజినేపల్లి: హరితహారం పథకం కింద పెంచిన మొక్కలను నాటే సమయంలో నిర్లక్ష్యం తగదని, లోతుగా గుంతలు తీసి మొక్కలు నాటాలని, ఆ సమయంలో గుంతలు గట్టిగా పూడ్చి నీళ్లు పోయాలని ఎంపీడీఓ కృష్ణయ్య సూచించారు. బుధవారం మండలంలోని పోలెపల్లి గ్రామాన్ని సందర్శించారు. గ్రామపంచాయతీ రికార్డులను పరిశీలించారు.

మాజీ సైనికులకు ఘన సన్మానం



కల్వకుర్తి మాజీ సైనికులను సన్మానించిన ఆచారి

అచ్చంపేట రూరల్: దేశం కోసం పని చేసిన మాజీ సైనికులను బుధవారం అచ్చంపేటలో బీజేపీ అసెంబ్లీ కోఆర్డినేటర్ మండికారి బాలాజీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. దేశ ప్రధాని నరేంద్రమోడీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మేరీ మిటీ– మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా సైనికుల సేవలను గుర్తించుకున్నామన్నారు. మాజీ సైనికులు ఖలీల్, రాణా ప్రతాప్, సైదులు, చంద్రయ్య పాల్గొన్నారు.

వెల్దండ: మండల కేంద్రంలో బుధవారం సర్పంచ్ భూపతిరెడ్డి ఆధ్వర్యంలో కొండకత్వ చెరువు వద్ద జాతీయ జెండాలను సర్పంచ్ భూపతిరెడ్డి ఆవిష్కరించారు. మాజీ సైనికులను శాలువాలతో సన్మానించారు. నిరంజన్, అల్లీం, వెంకటయ్య ముదిరాజ్, జంగయ్య, కృష్ణారెడ్డి, రాము తదితరులు పాల్గొన్నారు.

కల్వకుర్తి రూరల్: దేశరక్షణలో సైనికుల పాత్ర వెలకట్టలేనిదని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి అన్నారు. ఆజాదికా అమృతోత్సవం కార్యక్రమంలో భాగంగా ‘నేను పుట్టిన నేల నేను కన్న దేశం’ అనే కార్యక్రమానికి కల్వకుర్తిలో బుధవారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా పట్టణంలోని పద్మశాలీ భవనంలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో ఆచారి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

నలుగురు బైండోవర్

లింగాల: సారా అమ్మకాల కేసులో బుధవారం ఎక్సైజ్ శాఖ వారు నలుగురిని తహసీల్దార్ మునిరొద్దీన్ ఎదుట బైండోవర్ చేశారు. అప్పాయపల్లికి చెందిన వసురాం, మనెమ్మ, చెన్నంపల్లికి చెందిన గణపతి, హన్మంతుపై సారా అమ్మకం కేసులు నమోదు చేశామని ఎక్సైజ్ ఎస్‌ఐ జనార్దన్ తెలియజేశారు.

యాసిడ్ బాటిల్‌తో నిరసన

అచ్చంపేట రూరల్: ఆస్పత్రి ఏజెన్సీ నిర్వాహకుడు అకారణంగా తనను విధుల నుంచి తొలగిస్తామని బెదిరిస్తూ దుర్భాషలాడుతున్నాడని ఆరోపిస్తూ బుధవారం అచ్చంపేట 100 పడకల ఆస్పత్రిలోని కార్మికురాలు యాసిడ్ బాటిల్‌తో నిరసన వ్యక్తం చేసింది. ఆస్పత్రి ఎదుట యాసిడ్ బాటిల్‌తో యాసిడ్ తాగి ఆత్మహత్య చేసుకుంటానని కూర్చుని ఉండగా.. తోటి కార్మికులు బలవంతంగా బాటిల్‌ను తీసుకుని పగులగొట్టారు. కార్మికురాలు కొన్ని రోజుల నుంచి ఆస్పత్రిలో పారిశుద్ధ్య కార్మికురాలిగా పనిచేస్తుంది.. ఏజెన్సీ నిర్వాహకుడు శంకర్ తరచూ వేతనంలో కోతలు విధిస్తూ దుర్భాషలాడుతున్నాడని ఆరోపించింది.

వ్యక్తిపై కేసు నమోదు

వెల్దండ: మండల పరిధిలోని భర్కత్‌పల్లికి చెందిన సంపంగి అలివేలు ఫిర్యాదు మేరకు వంగూర్ శేఖర్‌పై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ పేర్కొన్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. భర్కత్‌పల్లికి చెందిన అలివేలుతో మంగళవారం అదే గ్రామానికి చెందిన శేఖర్ అసభ్యకరంగా ప్రవర్తించడంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

వెల్దండ: మండల కేంద్రానికి చెందిన మట్ట నర్సింహగౌడ్(55) బుధవారం పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నర్సింహగౌడ్ ఇంటిపైకి ఎక్కి పురుగు మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం నిమిత్తం వెల్దండలోని యెన్నమ్స్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం పరిస్థితి నిలకడగ ఉన్నట్లు బంధువులు తెలిపారు.

మాదకద్రవ్యాలను పూర్తిగా నియంత్రిద్దాం

అచ్చంపేట రూరల్: అందరి సహకారంతో మాదకద్రవ్యాలను పూర్తిగా నియంత్రిద్దామని సిద్ధాపూర్ ఎస్‌ఐ శేఖర్‌గౌడ్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని బొమ్మన్‌పల్లి ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, బాల్యవివాహాలపై అవగాహన కల్పించారు.

క్రీడలతో స్నేహ సంబంధాలు

కల్వకుర్తిరూరల్: క్రీడలతో స్నేహసంబంధాలు పెరుగుతాయని ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం కల్వకుర్తి మండలం తర్నికల్ తండాలో నిర్వహించిన క్రికెట్ పోటీల ముగింపు సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పోటీల్లో మొదటి స్థానంలో నిలిచిన జట్టుకు రూ.15 వేలు, రెండో స్థానంలో నిలిచిన జట్టుకు రూ.10 వేలు అందజేశారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

మన్ననూర్: నల్లమల లోతట్టు ప్రాంతంలోని చెంచుపెంటల్లో నివాసం ఉంటున్న చెంచులు తమ ఆరోగ్యంపై తీసుకోవాల్సిన పలు జాగ్రత్తలపై అచ్చంపేట డిప్యూటీ డీఎంహెచ్‌ఓ తారాసింగ్ వివరించారు. బుధవారం వైద్య సిబ్బందితో కలిసి బౌరాపూర్, ఈర్లపెంట, మేడిమల్కల చెంచు పెంటల్లో పర్యటించామని అన్నారు. డివిజన్ ఉప మలేరియా అధికారి అశోక్ ప్రసాద్, వైద్యాధికారులు అభిలాష్, సరోజ తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణపై..

బల్మూర్: మండలంలోని కొండనాగులలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం షీ టీమ్ ఆధ్వర్యంలో నేరాల నియంత్రణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

ఇంటి సామగ్రి పంపిణీ

కల్వకుర్తి రూరల్: మండలంలోని పంజుగులకి చెందిన పరశురాములుకు ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ ఇంటి నిర్మాణం కోసం భూమి పూజ చేశారు. బుధవారం ఇంటి నిర్మాణానికి అవసరమైన సామగ్రిని జాగృతి విద్యార్థి విభాగం జిల్లా కన్వీనర్ గణేష్ వెంట పంపించారు.

అభివృద్ధికి బాధ్యతగా పనిచేయాలి

అమ్రాబాద్: గ్రామాల అభివృద్ధికి బాధ్యతగా పనిచేయాలని ఎంపీడీఓ రామ్మోహన్ సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశం హాలులో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందికి సమావేశం నిర్వహించారు. పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తు చేసుకున్న రైతుల నుంచి రేపటిలోగా పూర్తి డాక్యుమెంట్స్ సేకరించాలని సూచించారు. ముఖ్యంగా నీటి ట్యాంకులు శుభ్రం చేయాలని, ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు నిర్వహించాలన్నారు.

ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్తాం..

అచ్చంపేట రూరల్: పట్టణ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్తున్నామని మున్సిపల్ చైర్మన్ నర్సింహగౌడ్ అన్నారు. బుధవారం పట్టణంలోని పలు వార్డులను పరిశీలించారు. నీటి సమస్యతో పాటు ఇతర సమస్యలను వెంటనే పరిష్కరించాలని అక్కడి సిబ్బందిని ఆదేశించారు.

బతుకమ్మ ఆడిన ఏఎన్‌ఎంలు

నాగర్‌కర్నూల్‌రూరల్: పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట తెలంగాణ రాష్ట్ర ఏఎన్‌ఎంల సంఘం సభ్యులు, ఏఐటీయూసీ కార్మిక సంఘం నాయకులు బతుకమ్మ ఆడి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మారేడు శివశంకర్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం సెకండ్ ఏఎన్‌ఎంలను రెగ్యులర్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. సెకండ్ ఏఎన్‌ఎంలు ఫర్వీన్, శ్రీవిద్య, భాగ్య పాల్గొన్నారు.

ఉద్యోగుల నియామకం

మన్ననూర్: ప్రభుత్వ గిరిజన శాఖల్లో సిబ్బంది కొరత కారణంగా జీసీసీలో విధులు నిర్వహించేందుకు గానూ వెంకటేష్‌ను సేల్స్‌మెన్‌గా విజయను ఎంసీడబ్ల్యూగా నియమిస్తూ కలెక్టర్ చేతుల మీదుగా నియామక పత్రాలను అందజేశారు. జిల్లాలో అక్కడక్కడ ఉద్యోగుల కొరత ఉన్న విషయాన్ని తరుచుగా ఆదివాసీ గిరిజనులు అంటుంటారని ఆదివాసి దినోత్సవం సందర్భంగా కొంత మేరకు సమస్య పరిష్కారం దిశగా ఆలోచించి నిర్ణయం తీసుకున్నామని అన్నారు. ఐటీడీఏ పరిధిలో వివిధ శాఖల్లో డిప్యూటేషన్ ప్రాతిపదికగా నియామకాలు చేశామని అన్నారు. అదేవిధంగా జీసీసీలో విధులు నిర్వహిస్తూ అకాల మృతి చెందిన వారి స్థానంలో వారి కుటుంబ వారసులకు ఈ అవకాశం ఇవ్వడం జరిగిందని అన్నారు. సంతోష్ కుమార్, సాయిబాబ, రాములు ఉన్నారు.